## సమస్యల పరిష్కారానికి కాల్ సెంటర్ ఏర్పాటు

పెద్దపల్లి, నవంబర్7: జిల్లాలో ధాన్యం కొనుగోలులో సమస్యల పరిష్కారానికి కాల్ సెంటర్ ఏర్పాటు చేశామని కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి సమస్యలు ఉన్నా 7995050781నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొనానరు. కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు గోనె సంచులు, లారీల సమస్యలు ఏవైనా ఉంటే వెంటనే 7995050780లో సంప్రదించాలని సూచించారు.

## విద్యార్థులకు అవగాహన

పాలకుర్తి, నవంబర్7: కుక్కలగూడూర్ ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు షీ టీమ్ సభ్యురాలు స్నేహలత మహిళభద్రత, అన్‌లైన్ మోసాలు, యాంటీ డ్రగ్స్‌పై గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సురేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నాకో భవనం నిర్మించండి..!

- తహసీల్దార్ కార్యాలయం ఆత్మఘోష

కమాన్‌పూర్, నవంబర్ 7: నేను పుట్టింది అద్దె భవనంలోనే.. పెరిగింది అద్దె భవనంలోనే. మధ్యలో తాత్కాలికంగా పేరుకే సొంత భవనమైన శిథిలావస్థకు చేరిన పోలీస్‌స్టేషన్ పాత భవనంలో కొన్నాళ్లు.. నా కార్యాలయాన్ని నిర్వహించుకున్న. అక్కడ వస్తువులు, సౌకర్యాలు సక్రమంగా లేక మళ్లీ అద్దె భవనంలోనే కొనసాగుతూ వస్తున్న. అమాత్యా... నా తహసీల్దార్ భవనం గురించి మీకు తెలియంది కాదు. కానీ మీరిప్పుడు రాష్ట్ర కేబినెట్‌లో కీలక మంత్రిగా కొనసాగుతున్నారు. జర నాపై దృష్టి సారించి నూతన కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి భవన నిర్మాణం పూర్తి చేయించి నన్ను కొత్త కార్యాలయం కొలువుదీరేటట్లు చేయాలని వినమ్రంగా కోరుకుంటున్న. నా కార్యాలయం ఏర్పడిన కొంత కాలం తర్వాత ఓ చిన్న శుభవార్త వినపడింది. కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పాత భవనాన్ని వీడి కొత్త భవనంలోకి చేరుతుందని తెలిసింది. ఇంతలో ఆ పాత పోలీస్‌స్టేషన్ భవనం నా తహసీల్దార్ కార్యాలయానికి కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు రావడంతో ఇన్నాళ్లకు సొంత భవనంలోకి వెళ్తున్నట్లు సంతోషం కలిగింది. కానీ ఇది 3 నెలల ముచ్చటగానే మిగులుతుందని నాకు అప్పుడు తెలియలేదు. తీరా ఆ భవనంలోకి పోయాక వాన వస్తే చాలు నా కార్యాలయం రికార్డులన్నీ తడిసి పోవడం, స్లాబ్ పెచ్చులు ఊడిపోవడం, ఇలా అనునిత్యం భయం భయంగా కార్యాలయంలో ఉద్యోగులు విధులు నిర్వర్తించే పరిస్థితి నెలకొని ఉండేది. మీరు మంత్రిగా ఉన్నారుగా.. ఇప్పుడైనా నాకు సొంత భవనం నిర్మిస్తారని సవినయంగా వేడుకుంటున్న.



అద్దె భవనంలో కమాన్‌పూర్ తహసీల్దార్ కార్యాలయం























